లైంగికదాడులను అరికట్టడంలో బిజెపి ప్రభుత్వం విఫలం

- పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కరువు : సాయిబాబు
- తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా రాష్ట్ర ఐదో సదస్సు.. భారీ ప్రదర్శన



సదస్సులో మాట్లాడుతున్న సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో మహిళలపై రోజురోజుకూ హత్యలు, లైంగికదాడులు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమవుతోందని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఈ నేరాల సంఖ్య పెరుగుతోందని అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా రాష్ట్ర ఐదో సదస్సును నిర్వహించారు. సిఐటియు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఆర్.త్రివేణి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో సాయిబాబు మాట్లాడారు. మహిళలకు చట్టపరంగా ఇవ్వాల్సిన ప్రసూతి సెలవులను ఇవ్వడం లేదని, వారికి రావాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్ కూడా సకాలంలో చెల్లించడం లేదని అన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి ఎనిమిది గంటల పని దినాలను 12 గంటలకు మార్చిందని, దాంతో మహిళలు మరింత బానిసత్వంలోకి నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్‌ల రద్దు కోసం శ్రామిక మహిళలు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, ఒకశాతం ఉన్న సంపన్నుల వద్ద 45 శాతం డబ్బు పోగైందని అన్నారు. తిండికి, బట్టకు, ఇల్లుకు నోచుకోని వారు కోట్లాది మంది ఉన్నారని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి అయిన సరుకులు అమ్ముడుపోక వాటి అమ్మకం కోసం యాజమాన్యాలు అనేక ఆఫర్లు పెడుతున్నాయన్నారు. అయినా సరుకులు అమ్ముడుపోవడం లేదనీ, దీనికి ప్రజల కొనుగోలు శక్తి తగ్గడమే ప్రధాన కారణమని తెలిపారు. ప్రజల మధ్య మత వైషమ్యాలు సృష్టించి బిజెపి ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తోందని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రావడంలో ఇసుమంత పాత్ర కూడా లేని ఆర్ఎస్ఎస్ నేడు దేశభక్తిని వల్లబోస్తోందని విమర్శించారు. రాజ్యాంగం రక్షింపబడాలన్నా, కార్మిక హక్కులు కాపాడబడాలన్నా సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు వాస్తవాలు అర్థం చేసుకొని బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

సదస్సుకు ముందు కాగజ్‌నగర్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు. బాలభారతి పాఠశాల నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన మార్కెట్ ఏరియా, అంబేద్కర్ చౌక్, రాజీవ్ చౌక్, లారీ చౌక్ మీదుగా వినయ్ గార్డెన్ వరకు సాగింది. ప్రదర్శనలో గుస్సాడీ, ఒగ్గు డోలు కళాకారులు చేసిన సంప్రదాయ నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళలు బతుకమ్మలు చేతపట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌వి రమ, సిఐటియు కార్యదర్శి పద్మశ్రీ, ఉపాధ్యక్షులు భూపాల్, జె వెంకటేష్, పి జయలక్ష్మి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె రాజేందర్, ముంజం శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు కూశన రాజన్న, దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్, గొడిసెల కార్తీక్, గెడం టీకానంద్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వి ఆనంద్, జిల్లా కార్యదర్శి ఆర్. మహేష్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, దిగిడ బక్కన్న, వివిధ జిల్లాల నాయకులు, శ్రామిక మహిళలు పాల్గొన్నారు.

పెంచిన ఆర్‌టిసి ఛార్జీలను విరమించుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెంచిన ఆర్‌టిసి ఛార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాదు-సికింద్రాబాదు జంట నగరాల్లో ఆర్‌టిసి ఛార్జీలు మొదటి మూడు స్టేజీలకు రూ.ఐదు, నాలుగో స్టేజీకి రూ.పది చొప్పున పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయతో సామాన్య ప్రజలకు తీవ్ర భారమవుతుందని పేర్కొన్నారు. కొత్త డిపోలు, కొత్త ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటుకు రూ.392 కోట్లు ఖర్చు అవుతుందని, ఈ ఛార్జీలను పెంచుతున్నట్లు, అందుకు ప్రజలు సహకరించాలని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాదులో ఎలక్ట్రికల్ బస్సు చార్జీలను, బస్సు పాస్ చార్జీలను భారీగా పెంచిందని గుర్తు చేశారు. అలాగే పండగల పేరుతో ప్రజల నుండి 50 శాతం ప్రత్యేక చార్జీలు వసూలు చేస్తూనే ఉన్నారని తెలిపారు. మౌలిక సదుపాయాలకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా ప్రజలపై మరోసారి అదనంగా భారాలు వేయడం సమంజసం కాదని హితవు పలికారు.

ఆర్‌టిసిలోనే కార్గో సేవలను కొనసాగించాలి

ఆర్‌టిసి కార్గో సర్వీసులను ప్రయివేటీకరించడానికి ప్రయత్నిస్తున్నట్టు వార్తలొస్తున్నాయని, ఆర్‌టిసిలోనే కార్గో సేవలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఆ సేవలను ప్రయివేటీకరించాలనే ప్రయత్నాలను విరమించుకొని డిమాండ్ చేశారు. ఆర్‌టిసిలోనే కార్గోసేవలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత అందుబాటులోకి తేవాలని అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని జాన్‌వెస్లీ కోరారు.

విద్యలో మైనారిటీలకు నూతన దశ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మైనారిటీల విద్యలో నూతన దశ ప్రారంభమైందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలో మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను సహచర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌తో కలిసి ప్రారంభించారు. సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు అందనున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సిఎం సంకల్పంతో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ప్రతి ముస్లిం మైనారిటీ విద్యార్థిని ఉన్నత స్థాయిలో నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పేద, మధ్యతరగతి ముస్లిం కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్య అందించే దిశగా ఎర్రగడ్డలో రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సదుపాయాలతో కళాశాలను ప్రారంభించిందని చెప్పారు. విద్య సామాజిక సమానత్వానికి, ఆర్థిక స్వావలంబనకు ప్రధాన శక్తి అని వివరించారు. "మైనారిటీ విద్యార్థులు కూడా ఐఐటి, ఎన్‌ఐటి, ఎయిమ్స్ వంటి సంస్థల్లో స్థానం సంపాదించాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష" అని తెలిపారు. ఈ దిశగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు ద్వారా శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. సిఒఇల ద్వారా విద్యార్థులకు ఐఐటి, జెఇఇ, నీట్, క్లాట్, ఎన్‌డిఎ, క్యూట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందుతోందని తెలిపారు. రాష్ట్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు 205కి పెరిగి, 1.33 లక్షలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని వివరించారు. ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మైనారిటీ విద్యాలయాల్లో సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీ విద్యా బడ్జెట్ 40 శాతం పెంచామని గుర్తు చేశారు.

సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీలు

- నేటి నుంచి అమలు చేస్తామని ఆర్‌టిసి ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నడిచే అన్ని రకాల సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు ఆర్‌టిసి ప్రకటించింది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సులు- ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లలో మొదటి మూడు స్టేజీలకు రూ.ఐదు, నాలుగో స్టేజీ నుంచి చివరి దాకా రూ.పది అదనపు ఛార్జీ విధించనున్నట్లు తెలిపింది. మెట్రో డీలక్స్, ఎలక్ట్రిక్-మెట్రో ఎసి సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి చివరిదాకా రూ.10 అదనపు ఛార్జీని వసూలు చేయనున్నట్లు వివరించింది. ఈ నెల 6వ తేదీ (సోమవారం) నుంచి ఇవి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. "గ్రేటర్ హైదరాబాద్‌లో 25 డిపోలున్నాయి. 265 ఎలక్ట్రిక్ బస్సులున్నాయి. ఈ ఏడాది మరో 275 రానున్నాయి. వాటికోసం ఇప్పటికే ఆరు డిపోల్లో... ఒక్కో డిపోలో రూ.8 కోట్ల వ్యయంతో హెచ్‌టీ కనెక్షన్లను తీసుకుని ఛార్జింగ్ స్టేషన్లు నెలకొల్పాం. 2027 నాటికి రాబోయే 2,800 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం 19 డిపోల్లో ఛార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లు కావాలి. కొత్తగా 10 డిపోలను ఏర్పాటు చేయనున్నాం. నూతనంగా పది ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తాం. ఈ మౌలిక సదుపాయాలకు రూ.392 కోట్ల మేర వ్యయమవుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ఆర్థిక భారాన్ని మోయలేం. ఈ నేపథ్యంలోనే సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధించేందుకు అనుమతి ఇవ్వాలని ప్రతిపాదించాం. సెప్టెంబరు 23న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది" అని ఆర్‌టిసి విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించింది.


రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న బండారు దత్తాత్రేయ తదితరులు

బిసి రిజర్వేషన్లు వ్యతిరేకిస్తే తగిన గుణపాఠం

- రౌండ్ టేబుల్ సమావేశంలో బిసి నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్లు వ్యతిరేకించే వారికి తగిన గుణపాఠం చెబుతామని బిసి సంఘాల నేతలు హెచ్చరించారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుదామంటూ పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. అశోకా హోటల్‌లో ఆదివారం జరిగిన అఖిలపక్ష పార్టీల నాయకులు సమావేశమై బిసి రిజర్వేషన్లపై నమోదైన కేసులపై చర్చించారు.

బిసి సంక్షేమ అధ్యక్షులు, ఎంపి ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, నేరెళ్ల ఆంజనేయులు, మండల ప్రతి పక్ష పార్టీ నాయకుడు మాజీ స్పీకర్ మధుసూదన్ చారి, పార్లమెంట్ సభ్యులు రవిచంద్ర, శాసనమండలి సభ్యులు కొమరయ్య, ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు వి. హనుమంత రావు, మాజీ శాసనసభ్యులు పుట్ట మధు, బొల్లా మల్లయ్య, ఆనంద భాస్కర్, పన్నాల శ్రీరాములు, చెరుకు సుధాకర్ హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా వారు సుప్రీంకోర్టు , హైకోర్టుల్లో వేసిన కేసులను ఎదుర్కోవడానికి ప్రముఖ అడ్వకేట్లను నియమించాలని చెప్పారు. హైకోర్టులో వెంటనే కేసులు వేయాలని, సుప్రీంకోర్టులో వేసిన కేసుల్లో అన్ని రాజకీయ పార్టీలు ఇంప్లీడు కేసులు వేయాలన్నారు. "ఎన్నో పోరాటాలు, ఉద్యమాల తర్వాత 42 శాతం రిజర్వేషన్లు సాధించాం. 50 శాతం సీలింగ్ ఉందని రిజర్వేషన్లు గిట్టని కొందరు ప్రజల్లో దుష్ప్రచారం చేస్తున్నారు. బీసీ ప్రజలకు న్యాయమైన వాటా వస్తుందంటే కొందరు కోర్టుకు పోయి అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారు. అగ్రకులాలకు లేని 50 శాతం సీలింగ్, బిసిలకు ఎందుకు?. బిసిలు పోరాడి సాధించుకున్న రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తే తగిన గుణపాఠం నేర్పుతాం. అనవసరంగా రిజర్వేషన్లను వ్యతిరేకించి గ్రామాల్లో శాంతియుత వాతావరణం చెడగొట్టొద్దు. అగ్రకులాల జనాభా ఆరు శాతం ఉంటే 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. బిసిలకు ఇంకా అన్యాయం జరుగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. దీనిని కూడా ఓర్వకపోతే సహించం" అని హెచ్చరించారు.

బడుగుల ఆశాజ్యోతి వెంకటస్వామి

- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్రమంత్రి గడ్డం వెంకటస్వామి బడుగుల ఆశాజ్యోతి అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. కాకా 96వ జయంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. దళిత, బహుజన వర్గాల పక్షాన ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అనంతరం రవీంద్రభారతిలో జరిగిన సభలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాకా చూపిన మార్గంలోనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని, సమాజంలోని ప్రతి వర్గం అభ్యున్నతే మా లక్ష్యమని పేర్కొన్నారు. సింగరేణిలో 40 ఏళ్ల క్రితమే 30 వేల మందికి ఇళ్ల స్థలాలను అందించిన ఘనత అయనకే దక్కుతుందని అన్నారు. అంబేద్కర్ విద్యా సంస్థలను ఏర్పాటు చేసి రెండు లక్షల మందిని ప్రయోజకులను చేశారని గుర్తు చేశారు. అట్టడుగు వర్గం నుంచి వచ్చిన కాకా చివరి వరకు నిరాడంబరంగా జీవించారని కొనియాడారు. పిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల గొంతుకగా, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత వెంకటస్వామి అని అన్నారు. ఆయన చూపిన మార్గం, విలువలు, సమానత్వం, న్యాయం, సేవా భావం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల కోసం 1949లో 'జాతీయ గుడిసెల సంఘం'ను స్థాపించి హైదరాబాద్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, ఎంపిలు గడ్డం వంశీకృష్ణ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ సిఎల్‌పి నేత జానా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు.. పాలమూరు బిడ్డలు

- వందలాది మంది లక్ష్మీ దేవమ్మ, వరలలు లక్ష్మీ తయారు కావాలి
- దేశ ప్రజల ప్రయోజనాలు అమెరికాకు మోడీ తాకట్టు
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కమ్యూనిస్టు ఉద్యమాలను నిర్మించడంలో వాటిని కొనసాగించడంలో భావితరాలకు ఉద్యమాల బాటను వేయడంలో మట్టిలో మాణిక్యాలుగా పాలమూరు బిడ్డలు తయారయ్యారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పుట్ట వరలక్ష్మి సంస్మరణ సభ జిల్లా కేంద్ర సమీపంలోని చిట్యాల డిఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ముందుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి ఎస్ వినయ కుమార్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్ తదితదులు పుట్ట వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్ అధ్యక్షతన జరిగిన సభలో వీరయ్య మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే వరలక్ష్మి ఉద్యమాల బాట పట్టడం, విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పనిచేస్తున్న పుట్ట ఆంజనేయులుకు తోడూనీడగా ఉండేందుకు నిర్ణయించుకొని జీవిత సహచరి కావడం గొప్ప విషయమన్నారు. వరలక్ష్మి జీవితం ఆదర్శమని, పెళ్లి, దాంపత్య జీవితం, ఉద్యమాల ఒరవడి, మరణానంతరం శరీర దానం కూడా సమాజ శ్రేయస్సు కోసమే అంకితం చేయడం.. కమ్యూనిస్టుల నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. భర్తకు అన్ని విధాలా సహకరిస్తూనే పిల్లల భవిష్యత్తుతో పాటు వారికి సమాజం పట్ల సామాజిక స్పృహను కలిగించేలా పెంచడం వరలక్ష్మి వ్యక్తిత్వానికి నిదర్శనమని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వనపర్తి.. కమ్యూనిస్టు ఉద్యమానికి పురిటిగడ్డ అని తెలిపారు. గతంలో పార్టీకి, ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడిన ఉద్యమ నాయకులు లక్ష్మీ దేవమ్మ, వనగంటి ఈశ్వర్ తరహాలోనే ఎంతోమంది పాలమూరు మట్టి బిడ్డలు తమ జీవితాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. బతికినప్పుడు చేసిన సేవలకన్నా.. మరణించాక శరీర దానానికి కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు సహకరించడం సమాజ పురోగతికి దోహదం చేయడమేనని చెప్పారు. ఇలాంటి ఉద్యమ నాయకుల నుంచి వారి ఆదర్శ భావాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త ఉద్యమాల బాట పట్టాలని పిలుపునిచ్చారు. వందేళ్ల చరిత్రగా చెప్పుకుంటున్న బిజెపి, ఆర్ఎస్ఎస్.. ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యం నుంచి నేటి అమెరికా సామ్రాజ్య అధిపత్యం వరకూ అంతా తలదించడమే తప్ప ఎదిరించి పోరాడిన చరిత్ర లేదని విమర్శించారు. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, బ్రెజిల్, వెనిజులాలో జరిగిన రాజకీయ పరిణామాలను చూసిన ప్రధాని మోడీకి వెన్నులో వణుకు పుట్టిందన్నారు. భవిష్యత్తులో భారత్‌లోనూ అలాంటి తిరుగుబాటు వస్తే తప్పించుకునేందుకు వీలుగా పార్లమెంటు నుంచి తన భవనం వరకు మోడీ సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. పదేపదే భారత్ పై పన్నులు విధిస్తూ ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీసేలా అమెరికా వ్యవహరిస్తుంటే మోడీ మౌనం వీడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత లడ్డాక్ ప్రజల ఆర్థిక, ప్రజాస్వామ్య, స్వేచ్ఛ, ఉద్యోగ, నిరుద్యోగ భృతి వంటి అన్ని అవకాశాలను కోల్పోయారని అన్నారు. ఇదే పరిస్థితి రేపు జమ్మూ కాశ్మీర్‌లోనూ తలెత్తనున్నదని తెలిపారు. అందుకోసమే భారతదేశంలో వర్గ పోరాటాలు అనివార్యం అని, అందుకోసం ప్రజా ఉద్యమాలకు ప్రజలను చైతన్యం చేస్తూ కమ్యూనిస్టులు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ మాట్లాడుతూ.. ఉద్యమంలో క్రియాశీలకంగా ఉంటూ వరలక్ష్మి మభ్యంతరంగా మన నుంచి దూరం కావడం విచారించదగ్గ విషయమని అన్నారు. వరలక్ష్మి కోరుకున్న సమాజం కేరళ, చైనా మోడల్ తప్ప, మత ఛాందసవాదంతో ఉన్న మోడీ మోడల్ కాదని తెలిపారు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి కంపెనీ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు మోడీ ప్రభుత్వం ఉద్యమాల బాట పడుతుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్ మాట్లాడుతూ.. పార్టీకి, మహిళా ఉద్యమానికి చేదోడువాదోడుగా ఉన్న వరలక్ష్మి అకాల మరణం.. ఆ కుటుంబానికి, పార్టీకి తీరని లోటని అన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ భవిష్యత్తులో ఉద్యమాలను ఉధృతం చేస్తూ ముందుకు నడవడమే ఆమెకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని గుర్తు చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ కుమార్ మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమంలోకి వచ్చిన వరలక్ష్మి ఆశయాలను కొనసాగిస్తూ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. వెంకట్రాములు, స్కైలాబ్ బాబు, సిపిఎం సీనియర్ నాయకులు కిల్లెగోపాల్, సిపిఎం ఉమ్మడి జిల్లా కార్యదర్శులు ఏ రాములు, వర్ధన్ పర్వతాలు, వెంకటస్వామి, పుట్ట వరలక్ష్మి కుమారుడు భరత్, కోడలు లక్ష్మీ ప్రసన్న, కూతురు దివ్య, అల్లుడు స్వామి గోపాల్, అత్తమ్మ పుట్ట బాలమ్మ, టీఎస్ యూటీఎఫ్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్, జావిద్ అలీ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్, ఉమ్మడి జిల్లా ప్రజా సంఘాల నాయకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు

బిసి రిజర్వేషన్లపై బలమైన వాదనలు వినిపిస్తాం

- సిఎం రేవంత్‌రెడ్డి, మీనాక్షి నటరాజన్‌తో భట్టి సంప్రదింపులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే అంశంపై ఆ పార్టీ కసరత్తు పూర్తి చేసింది. నలుగురి పేర్లతో కూడిన జాబితాను కూడా సిద్ధం చేసినట్టు తెలిసింది. కాంగ్రెస్ నేత నవీన్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్ పేర్లు ఆ జాబితాలో ఉన్నట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ జారీ చేసిన జీవోపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో రిజర్వేషన్ల అంశంపై కోర్టులో వ్యవహరించాల్సిన అంశాలపై న్యాయ కోవిదులతో సలహాలు, సూచనలు స్వీకరించి ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించేలా కార్యాచరణ రూపొందించింది. ఈ రెండు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి సంప్రదింపులు జరిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో సమావేశమయ్యారు. అనంతరం వారు ఢిల్లీకి బయలుదేరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీ నలుగురు పేర్లతో కూడిన జాబితాను భట్టి విక్రమార్క బృందం ఎఐసిసికి అందజేయనుంది. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు, ఓట్ చోరీ సంతకాల సేకరణ, డిసిసి అధ్యక్షుల ఎంపిక, పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై అధిష్టానానికి వివరించనున్నారు. మీనాక్షి నాటరాజన్‌తో సమావేశానంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అడ్డుకునే ప్రయత్నం జరుగుతున్నదని విమర్శించారు. హైకోర్టు, సుప్రీం కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు కూడా బిసి రిజర్వేషన్ల గురించి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, ఇడబ్ల్యుఎస్ తరగతులకు రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు ఉన్నట్టుగానే బలహీనవర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించడం వల్ల ఎవరికీ నష్టం ఉందని చెప్పారు. బలహీన వర్గాలకు అవకాశం ఇచ్చే విధంగా రాహుల్‌గాంధీ ఆలోచనా విధానంలో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రిజర్వేషన్లను ముందుకు తీసుకుపోతున్నట్టు తెలిపారు. కొంతమంది వ్యక్తిగతంగా రెడ్డిజాగృతి పేరుతో చేస్తున్నప్పటికీ అందరికీ సంబంధం ఉందనేది ఆవాస్తవమన్నారు. అన్ని రాజకీయ పార్టీల ఏకాభిప్రాయంతో ఈ బిల్లు ముందుకు సాగుతున్నదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

బస్సు ఛార్జీల పెంపు విరమించుకోవాలి

- తెలంగాణ జాగృతి డిమాండ్

హైదరాబాద్ బ్యూరో : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సిటీ బస్సు చార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్‌సింగ్‌నాయక్ డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. బస్సుల సంఖ్యను గణనీయంగా తగ్గించి.. బస్సు ప్రయాణాన్ని ఇబ్బందికరంగా మార్చేసిందని ఆరోపించారు. బస్సుల సంఖ్యను పెంచడాన్ని పక్కన పెట్టి చార్జీల భారాన్ని మోపిందని పేర్కొన్నారు. పండుగల పేరుతో ప్రజలపై అదనపు చార్జీల భారాన్ని మోపిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. పండుగ ముగియగానే సిటీలో చార్జీలను భారీగా పెంచిందని అన్నారు.ఒక్క స్టేజీ దాటితే రూ.10 అదనపు చార్జీ అంటే సామాన్యులు, నిత్యం పని చేసుకుంటేనే బతికేవారి పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిన తర్వాత అన్ని చార్జీలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నదని మండిపడ్డారు. రేవంత్ తప్పుడు విధానాలతో రాష్ట్రం అతలాకుతలం అవుతున్నదని అన్నారు. చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ప్రజలతో కలిసి తెలంగాణ జాగ తి పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రావు, యువ జాగృతి అధ్యక్షుడు శివారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బస్ ఛార్జీల పెంపుతో పేద, మధ్యతరగతి జేబులు గుల్ల

కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ జంట నగరాల్లో సిటీ బస్సు కనీస ఛార్జీని ఒకే సారి రూ. పది పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల పేద, మధ్యతరగతి జేబులు గుల్లయినట్టేనని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో రాష్ట్ర ప్రజలు అల్లాడుతున్న తరుణంలో ఈ ఛార్జీల పెంపు పిడుగులాంటిదని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్య ప్రయాణికుడిపై నెలకు కనీసం రూ.500 అదనపు భారం మోపితే, బడుగుజీవులు, దినసరి కూలీలు ఎలా బతకాలని ప్రశ్నించారు. "ఇప్పటికే విద్యార్థుల బస్ పాస్ ఛార్జీలు, పెంచింది చాలదన్నట్టు, ఇప్పుడు కనీస ఛార్జీపై కనికరం లేకుండా 50 శాతం ధరలను పెంచడం దుర్మార్గమని విమర్శించారు. "తుస్సుమన్న ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీ సంస్థను దివాళా తీయించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రయాణికుల నడ్డి విరచాలని చూడటం తగదని హితవు పలికారు.వెంటనే పెంచిన ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బైపిసి కోర్సుల అడ్మిషన్ షెడ్యూల్ విడుదల

- అక్టోబర్ ఐదు నుంచి స్లాట్ బుకింగ్‌కు అవకాశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ పార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టిజిఇఎపిసిటి 2025) మొదటి దశ బైపీసీ సంబంధిత కోర్సులైన బీఫార్మసీ, డీఫార్మసీ బయో-టెక్నాలజీ, బయో-మెడికల్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ కోర్సుల షెడ్యూల్‌ను తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు కమిషనర్ ఎ. శ్రీదేవసేన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు అక్టోబర్ 5 నుంచి 8 వరకు స్లాట్ బుకింగ్, 7 నుంచి 9 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, అర్హత కలిగిన అభ్యర్థులు ఏడు నుంచి 10 వరకు ఆప్షన్లను ఎంచుకోవాలని సూచించారు. అక్టోబర్ 13న ప్రాధాన్యతా క్రమంలో సీట్లు కేటాయించనున్నట్టు తెలిపారు. మరింత సమాచారం కోసం తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు.

అక్టోబర్ 6న ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల సర్టిఫికెట్ల పరిశీలన

తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీఐసీఈటీ)-2025 స్పెషల్ ఫేజ్ ఎంబిఎ, ఎంసిఎ కోర్సుల అడ్మిషన్ల షెడ్యూల్‌ను తెలంగాణ సాంకేతిక విద్యాశాఖ ప్రకటించింది. అక్టోబర్ 6న కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నట్టు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆరు నుంచి 7 వరకు ఆప్షన్లను ఎంచుకోవాలని సూచించారు. అక్టోబర్ 10న అర్హత కలిగిన అభ్యర్థులకు సీట్లను కేటాయించనున్నట్టు తెలిపారు.

పిజి వైద్య విద్యా ప్రవేశాల్లో విద్యార్థులకు అన్యాయం

- తక్షణ చర్యలు తీసుకోవాలి
- సిఎంకు మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పిజి వైద్య విద్యా ప్రవేశాల్లో రిజర్వేషన్ లేకపోవడం వల్ల తెలంగాణ విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్రమైన అన్యాయం జరిగిందనీ, దానిపై తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి టి హరీశ్‌రావు సిఎం రేవంత్ రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ఉదాసీనత, నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది పీజీ వైద్య విద్యా ప్రవేశాల్లో తెలంగాణ విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో స్థానిక రిజర్వేషన్ కల్పించకపోవడం వల్ల వందలాది తెలంగాణ విద్యార్థులు పీజీ సీట్లు కోల్పోతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల్లో మొత్తం 1,801 పీజీ సీట్లు ఉన్నాయనీ, వీటిలో 50 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద వెళ్తాయనీ, మిగిలిన 50 శాతం రాష్ట్ర కోటాలో ఉండే సీట్లలో 25 శాతం (సుమారు 450 సీట్లు) మేనేజ్‌మెంట్ కోటాగా ఉంటాయని తెలిపారు. అయితే ఈ సీట్లలో స్థానిక రిజర్వేషన్ అమలు చేయకపోవడంతో మొత్తం సీట్లు ఆల్ ఇండియా విద్యార్థులకు వెళ్ళిపోతున్నాయని పేర్కొన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 85శాతం స్థానిక విద్యార్థులకే రిజర్వేషన్ కల్పిస్తూ, కేవలం 15శాతం సీట్లు మాత్రమే నాన్-లోకల్ విద్యార్థులకు కేటాయించిందని తెలిపారు.



ఆయిల్ ఫెడ్‌లో జరుగుతున్న అవకతవకలపై

సమగ్ర దర్యాప్తు జరపాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి
- ప్రభుత్వం స్పందించకుంటే రైతు పోరాటం ఉధృతం: బొంతు రాంబాబు
- ఖమ్మంలో ఆయిల్ పామ్ రైతుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆయిల్ ఫెడ్ సంస్థలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ఆయిల్ పామ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం స్వర్ణ భారతి కల్యాణమండపంలో ఆయిల్ పామ్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుంబూరు మహేశ్వరరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినా సరైన పద్ధతిలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంలో విఫలమయ్యారని అన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తినప్పుడు బాధ్యతతో పరిష్కారం చేయకపోవడంతో రైతులు ఆయిల్ పామ్ సాగుకి ముందుకు రావడంలేదని తెలిపారు. దేశంలో 50 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం నెరవేరాలంటే కేంద్ర ప్రభుత్వం పామాయిల్ ధర పడిపోకుండా టన్నుకు రూ.25 వేల కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు. బహుళజాతి సంస్థల ఒత్తిడికి లొంగిన ప్రభుత్వాలు పామాయిల్, పత్తి దిగుమతి సుంకం తగ్గింపు పూర్తిగా ఎత్తివేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ రైతులకు సరఫరా చేసిన మొక్కలు జన్యుపరమైన లోపంతో గెలలు రాక ఐదు నుంచి ఏడు సంవత్సరాలు పెంచి తోటలు తొలగించే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయిల్ పామ్ రైతుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఆయిల్ పామ్ రైతుల సమస్యలు ప్రస్తావించేందుకు రాష్ట్రంలో ఉన్న పార్లమెంట్ సభ్యులు దృష్టి సారించాలని అన్నారు.

బొంతు రాంబాబు మాట్లాడుతూ.. మొక్కలు ఆయిల్ ఫెడ్ సంస్థ నర్సరీలో పెంచకుండా ప్రయివేటు యాజమాన్యాల నర్సరీలో పెంచి వాటిని రైతులకు సరఫరా చేయడంతో ఆఫ్ టైప్ వచ్చి గెలలు రాక రైతులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వంకు, ఆయిల్ ఫెడ్ సంస్థకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. కోట్ల రూపాయలు నష్టంపై సమగ్ర విచారణ జరిపి దోషులను తేల్చాలని డిమాండ్ చేశారు. గతంలో గెలలు రాని మొక్కల విషయంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన శాస్త్రవేత్తల బృందం నివేదికను బహిరంగ పరచాలని కోరారు. రైతులు కొక్కెరపాటి పుల్లయ్య, కారం శ్రీరాములు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ రైతులకు అవసరమైన కలెక్షన్స్ సెంటర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా రైతులు ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని కోరారు. ఈ రాష్ట్ర సదస్సులో సంఘం నాయకులు జోగి బాబు, చేలికాని వెంకట్రావు, దొడ్డ చక్రధర్ రెడ్డి, వనపర్తి జిల్లా బుచ్చన్న, నల్గొండ గురువారెడ్డి, సూర్యాపేట సంగీత రెడ్డి, చింతనిప్పు చలపతిరావు, ధనమ్మ, పాషా, సత్యనారాయణరెడ్డి, దొడ్డ లక్ష్మీనారాయణ. కొప్పుల కృష్ణయ్య, పూర్ణచంద్రరావు, అమరనేని అప్పారావు, యనమద్ది రామకృష్ణ, దొడ్డపనేని కృష్ణార్జున్, సంక్రాంతి పురుషోత్తం, కట్టా రాంబాబు, చావా వేణు, యనమద్ది లెనిన్, సంక్రాంతి నర్సయ్య, దుగిని అజయ్‌తోపాటు వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బిఆర్ఎస్.. దోపిడీ పార్టీలు

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్, బిఆర్ఎస్ దోపిడి పార్టీలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా అందోలులోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాలులో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేండ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకోవడానికి డబ్బులు లేకపోవడంతో బాధపడుతుందని అన్నారు. ఎన్నికల్లో అబద్దపు హామీలను ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వేల ఎకరాల పంటలు నాశనమయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం పంటల నష్టపరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందని తెలిపారు. కోర్టు కేసుల పేరుతో స్థానిక ఎన్నికలను జాప్యం చేస్తుందన్నారు. రాష్ట్రంలో మారుమూల గ్రామాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా తయారైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో మెజార్టీ సీట్లను గెలుచుకొంటామని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు వట్‌పల్లి మండలం పోతుల బోగూడ గ్రామానికి చెందిన న్యాయవాది చంటి దేవిక ప్రభు తన అనుచరులతో బిజెపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మండల అధ్యక్షురాలు మహేష్కర్ పావని సుమన్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా వార్తలు అవాస్తవం

- ఎమ్మెల్యే దానం నాగేందర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేయబోతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఖైరాతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో తనను కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడారు.


తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదని స్పష్టం చేశారు. నేనంటే గిట్టని వాళ్ల తనపై దుష్ప్రచారం చేస్తున్నారనీ, ఆ ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

వరద బాధితులను ఆదుకోని ముఖ్యమంత్రి ఎందుకు..?

- ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలి
- యాసంగికి పోచారం నీరు అందించాలి : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు నాగిరెడ్డిపేట్ మండలంలో రైతులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేటికీ ఎలాంటి సాయం అందించలేదు. నెల రోజులు గడిచినా వరద బాధితులను ఆదుకోని నువ్వేం ముఖ్యమంత్రివయ్యా.' అని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలంలోని బంజారా ప్రాంతంలో ముంపునకు గురైన పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా "మమ్మల్ని ఆదుకోండి సారూ.. అన్నీ కోల్పోయాం" అని గిరిజన మహిళలు హరీశ్‌రావును వేడుకున్నారు. భారీ వర్షాల కారణంగా పంటలను మునిగిపోయాయి. రైతు బంధు పడలేదు. నెలకు రూ.2500 ఇస్తానన్న ఇవ్వడంలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాగిరెడ్డిపేట్ మండల వ్యాప్తంగా ముంపునకు గురైన పంటల వివరాలను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 4న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి జిల్లా పర్యటన చేసి వరద బాధితులను ఆదుకుంటామని చెప్పి నెల గడిచినా ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదని అన్నారు. జిల్లాలో రూ.344 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని జిల్లా అధికారులు రిపోర్టు పంపారని, అలాగే ప్రాణ నష్టం జరిగినా ఇప్పటికీ ఎలాంటి సహాయం చేయలేదని అన్నారు. రోడ్లు, చెరువులు తెగిపోయాయని, విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, చెరువులకు, కాలువలకు గండ్లు పడ్డాయని అయినా


బాధితులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పునరుద్ధరణ చేపట్టలేదన్నారు. ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వరకు బస్సులు నడవడం లేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యవేక్షించింది లేదని విమర్శించారు. ఇప్పటికీ కూలిపోయిన ఇండ్ల బాధితులకు రూపాయి కూడా అందించలేదని, ఎకరాకు తక్షణ ఆర్థిక సహాయం రూ.10వేలు అందిస్తామని చెప్పి పైసా సాయం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా ఇవ్వలేక, బోనస్ ఇవ్వలేక రైతులు ఇబ్బంది పడుతున్న సమయంలో వరద ముంచేసినా ప్రభుత్వం నుంచి సహాయం శూన్యంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలెక్కువ చేతలు తక్కువ అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జనార్ధన్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రతాపరెడ్డి, బిఆర్ఎస్ మండలాధ్యక్షులు గుర్రాల సిద్దయ్య, మాజీ జడ్‌పిటిసి మనోహర్‌రెడ్డి, కామారెడ్డి బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ముజీబుద్దీన్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కృష్ణ, ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ చైర్మన్ రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నార్త్ ఇండియా వైపే బిజెపి..

అనంతరం కామారెడ్డి జిల్లా గాంధారిలో నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి హరీశ్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిజెపి నుంచి బిఆర్ఎస్‌లోకి నాయకులు, కార్యకర్తలు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారుడు తానాజీరావు బిజెపికి వెళ్లి తిరిగి బిఆర్ఎస్ పార్టీలో చేరినందుకు వారికి సాదరంగా ఆహ్వానం పలుకుతున్నానని అన్నారు. బిజెపి పేద ప్రజలు, రైతులు, దళితుల పక్షాన ఉండదని, కేవలం నార్త్ ఇండియా వైపే ఉంటుందని అన్నారు. తెలంగాణ దేశంలో లేదా? ఎందుకు తెలంగాణకు నిధులు ఇవ్వరని ప్రశ్నించారు.


నాగేశ్వరరావును పరామర్శిస్తున్న తమ్మినేని

గుడిపూడి నాగేశ్వరరావుకు తమ్మినేని పరామర్శ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అనారోగ్యంతో బాధపడుతున్న ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రామాపురం గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు గుడిపూడి నాగేశ్వరరావుని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ఆదివా రం పరామర్శించారు. గుడిపూడి నాగేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధప డుతున్నారు. రామాపురం సిపిఎం నాయకులు ఈ విషయాన్ని తమ్మినేని వీరభద్రం దృష్టికి తీసుకురావడంతో ఆయన నాగేశ్వరరావుని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు. తమ్మినేని వెంట పార్టీ మండల కార్యదర్శి కిలారు సురేష్, మండల కమిటీ సభ్యులు కొమ్మినేని నాగేశ్వరరావు, గుడిపూడి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కొండా నాగేశ్వరరావు, కెవిపిఎస్ మండల కార్యదర్శి గార్లపాటి రమేష్, నాయకులు తదితరులు ఉన్నారు.

పెరికల అభివృద్ధికి కృషి

- అలయ్-బలయ్ కార్యక్రమంలో ముత్తినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెరిక కులస్థుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో కెఆర్‌సి గార్డెన్‌లో పెరిక కుల అలయ్-బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సోదరుల ఐక్యత కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. తద్వార సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం పెరిక కుల ఆ భివృద్ధికి కట్టుబడి ఉందని, అందులో భాగంగానే పెరిక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. రూ. 50 కోట్ల నిధులు కేటాయించిందనీ, ఆ నిధులతో సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్యే పాయల శంకర్, పెరిక కుల రాష్ట్ర అధ్యక్షులు మద్దా లింగయ్య, మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ భద్రయ్య, మునిసిపల్ మాజీ చైర్మెన్ జుట్టుకొండ సత్యనారాయణ, రాష్ట్ర మాజీ అధ్యక్షులు దాసరి మల్లేశం,పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అసోసియేషన్ అధ్యక్షులు కోట మల్లికార్జున్ రావు తదితరులు మాట్లాడారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

చరిత్రను దెబ్బతీసేలా వక్రీకరణ

- పాఠ్యపుస్తకాల్లో చరిత్ర పాఠ్యాంశాల మార్పు దారుణం : ఆకునూరి మురళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాఠ్య పుస్తకాల్లో భారతదేశ లౌకిక, సమగ్ర చారిత్రక వారసత్వాన్ని వక్రీకరిస్తూ విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని బలహీనపరిచే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తోందని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని మదీనా ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఎఐపిసి) ఆధ్వర్యంలో 'పాఠ్యపుస్తకాల్లో చరిత్ర వక్రీకరణ.. దాని చిక్కులు' అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ ఎజెండాలకు ఉపయోగ పడేలా చారిత్రక వాస్తవాలను తారుమారు చేయడం దారుణమన్నరు. విద్యా విధానంలో విభజన భావజాలాలపై, ఐక్యత, వాస్తవ ఖచ్చితత్వాన్ని ప్రోత్సహించే పాఠ్యాంశాలు అవసరమని తెలిపారు. ఇటువంటి వక్రీకరణల వల్ల యువతలో విమర్శనాత్మక ఆలోచనాశక్తి బలహీనపడుతుందని హెచ్చరించారు. ప్రొఫెసర్ రామ్ పునియాని, డాక్టర్ కాంచన్ మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలలోని బహువచన కథనాలు, విద్యా, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలపై నొక్కి చెప్పారు. సైద్ధాంతిక పక్షపాతాల నుంచి చరిత్ర, విద్యను కాపాడటానికి విద్యావేత్తలు, విధాన రూపకర్తల నుంచి సమిష్టి కృషి అవసరమని పిలుపునిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ జర్నలిజం ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ.. చరిత్ర మూలాలను విమర్శనాత్మకంగా అంచనా వేయడానికి, విద్యలో పొందుపరిచిన ప్రచారాన్ని నిరోధించడానికి, విద్యార్థులకు బోధించే ప్రాముఖ్యతను చెప్పారు.

హిమాయత్‌సాగర్ ఒఆర్ఆర్‌పై ఆరు కార్లు ఢీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



హిమాయత్‌సాగర్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఆరు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ముందు వెళ్తున్న కారు ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనకున్న కార్లు ఒకదానికొకటి ఢీకొన్న ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వెళ్తున్న ఎస్ క్రాస్ కారు డ్రైవర్ హిమాయత్‌సాగర్ వద్దకు రాగానే ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. ఇది గమనించని వెనక వచ్చిన మరో 5 వాహనాలు ఒకదానికొకటి ఢీకొట్టాయి. దాంతో ఆరు కార్ల ముందు భాగం ధ్వంసం అయ్యాయి. కార్లలో ఉన్న ఎయిర్ బెలూన్ ఓపెన్ అవ్వడంతో ప్రాణ నష్టం ఏమీ జరగలేదు. ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఔటర్ రింగ్‌రోడ్డుపై 2 కి.మీ మేర ట్రాఫిక్ జామ్ అయింది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు. మొదటి కారు వ్యక్తి సడన్ బ్రేక్ వేయడం వల్లనే ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు స్పష్టం చేశారు.

అనుకూలమెంతో.. ప్రతికూలమంతే

- కాంగ్రెస్ సర్కార్‌కు సవాల్‌గా స్థానిక పోరు
- కలవరపెడుతున్న బిఆర్ఎస్ హయాంలోని పెండింగ్ బిల్లులు
- బిజెపి ఎత్తుగడతో కాంగ్రెస్ సర్కారుకు యూరియా గండం
- పట్టాలెక్కని పథకాలతో గుబులు
- మేలు చేయనున్న వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ సర్కార్‌కు స్థానిక పోరు సవాల్‌గా మారింది. క్షేత్రస్థాయిలో అనుకూల అంశాలెన్ని ఉన్నాయో...ప్రతి కూల అంశాలూ అంతే స్థాయిలో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖతో నేరుగా సంబంధమున్న అంశాలు, స్థానిక సమస్యలు ఎక్కువగా కలవరపెడుతున్నాయి. ఏకకాలంలో రైతులకు రూ. రెండు లక్షల లోపు రుణమాఫీ చేయడం, పంట బోనస్ చెల్లించడం వంటి మంచి కార్యక్రమాలు కాంగ్రెస్ సర్కారుకు ప్లస్‌పాయింట్‌గా మారాయి. అయితే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు యూరియా కోటాను కుదించడం...ఇస్తామన్నదాంట్లోనూ కోత పెట్టడం...ఇచ్చినదీ సకాలంలో ఇవ్వకపోవడం వంటి పరిణామాలతో యూరియా గండం కాంగ్రెస్ సర్కారుకు చుట్టుకున్నది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఒక ఆయుధంగా మారింది. అయితే, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రాజకీయ ఎత్తుగడను, తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. అదే సమయంలో యూరియా కొరత అంశాన్ని రాజకీయం చేయడంలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు సక్సెస్ అయ్యాయి.

గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాజీ సర్పంచులకు పెట్టిపోయిన పెండింగ్ బిల్లుల వ్యవహారం కూడా కాంగ్రెస్ సర్కారు మెడకు చుట్టుకున్నది. ప్రభుత్వమనేది నిరంతరాయ ప్రక్రియ. పెండింగ్ బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం క్లియర్ చేయాల్సి ఉండే. అలా చేయలేదు. గత ప్రభుత్వం పెట్టిపోయిన బిల్లులు కాబట్టి విడతల వారీగా చెల్లిస్తామంటూ మెలిక పెట్టి కూర్చున్నది. రూ.400 కోట్లకుపైగా మాజీ సర్పంచులకు రాష్ట్ర సర్కారు బాకీ పడింది. దీనిపై మాజీ సర్పంచులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పోరాడుతూనే ఉన్నారు. ప్రతి గ్రామంలోనూ తాజా మాజీలు ఎంతో కొంత ప్రభావం చూపేవారే. ఆ బిల్లులను క్లియర్ చేస్తే కాంగ్రెస్‌కు కాస్త ప్లస్‌పాయింట్‌గా మారే అవకాశముండేదనే చర్చ నడుస్తున్నది. కోడ్ నేపథ్యంలో ఇప్పుడు క్లియర్ చేయలేని పరిస్థితి. మిషన్‌భగీరథ పథకంలో భాగంగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు సరిగా ఇవ్వట్లేదు. ఇంకా మూడు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదు కాబట్టి చేతుల్లోంచి జీతాలివ్వలేమంటూ మిషన్‌భగీరథ కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రతి నెలా వేతనాలు ఎప్పటికప్పుడు విడుదల చేస్తామనీ, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని గ్రామపంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ సర్కారు హామీనిచ్చింది. ఇవి రెండూ పట్టాలెక్కలేదు. రెండు,మూడు నెలలకోసారి జీతాలు విడుదల చేస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. ప్రస్తుతం వారికి రెండు నెలల వేతనాలు రావాల్సి ఉంది. ఇటీవల గ్రామ కార్యదర్శులకు రూ.104 కోట్లు విడుదల చేసినట్టు రాష్ట్ర సర్కారు ప్రకటించింది. అయితే, ఆ నిధులు కరెంటు బిల్లులు, రోజువారీ ఖర్చులకు, బుక్ అడ్జెస్ట్‌మెంట్లకు సంబంధించినవే. పంచాయతీ కార్యదర్శులు తమ చేతుల్లోంచి, అప్పు చేసి పెట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను ఇంకా క్లియర్ చేయలేదు. ఆ 104 కోట్ల రూపాయలు కూడా వారి ఖాతాల్లో ఇంకా జమకాలేదని విశ్వసనీయ సమాచారం. రెండు నెలలుగా ఫీల్డు అసిస్టెంట్లకు వేతనాలు ఇవ్వలేదు. పైన ప్రస్తావించిన మాజీ సర్పంచులు, ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజలతో సత్సంబంధాలు కలిగినవారే. ఈ అంశం అధికార పార్టీకి ప్రతికూలంగా మారే అవకాశముంది. ఎట్లాగూ ఎన్నికలకు పోయే ఆలోచన ఉంది కాబట్టి ముందే బిల్లులను, జీతాలను క్లియర్ చేస్తే కాంగ్రెస్ సర్కారు పట్ల కొంత సానుకూలంగా మారేదని చర్చనడుస్తున్నది. వంద యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకంతో గ్రామీణ పేదలు పెద్ద ఎత్తున లబ్దిపొందుతున్నారు. ఈ అంశం స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్లస్‌పాయింట్‌గా మారే అవకాశముంది. గ్యాస్ సబ్సిడీ పథకం కూడా కాంగ్రెస్‌కు లబ్ది చేకూర్చనున్నది. స్వయం సహాయక బృందాల సభ్యులకు వడ్డీలేని రుణాలు అందించి అదే సమయంలో వడ్డీ బకాయిలను విడుదల చేసింది. ఇది కూడా అధికార పార్టీకి పెద్ద సానుకూల అంశం. అన్నింటి కంటే ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు పెద్ద ఎత్తున ఆర్థిక భరోసానిస్తున్నది. పనులు, ఉద్యోగాల నిమిత్తం ఒక ఊరి నుంచి మరో ఊరికి ప్రయాణంలో చేయడంలో ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా మారింది. మహిళలకు ఆర్థిక వెసులుబాటునూ కల్పిస్తున్నది. అది అంతిమంగా కుటుంబానికి ఉపయోగకరంగా మారుతున్నది. మహిళలు సొంతంగా వ్యాపారులుగా ఎదగడంలో తోడ్పాటును అందిస్తున్నది. ఈ పథకాలతో మహిళల్లో కాంగ్రెస్ సర్కార్ పట్ల సింపతీ పెరిగింది. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏటా రూ.12 వేలు ఇస్తామని కాంగ్రెస్ సర్కారు మాటిచ్చింది. ఇప్పటివరకూ రాష్ట్రంలో 50 వేల మందికే అవి అందాయి. ప్రభుత్వం గుర్తించిన వారిలో ఇంకా 2.5 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. వీరే కాకుండా భూమిలేని పేదలు పెద్ద ఎత్తున ఉన్నారనే చర్చ ఉంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం నుంచి లబ్ది పొందిన వారి కంటే పొందని వారి సంఖ్య నాలుగు రెట్లు ఎక్కువగా ఉంది. వీరి ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికల్లో స్పష్టంగా కనిపించే అవకాశముంది.

నార్సింగిలో బిఎండబ్ల్యు కారు బీభత్సం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నార్సింగి పరిధిలోని మైహోమ్ అవతార్ ఎదురుగా ఉన్న సిగ్నల్ వద్ద ఆదివారం సాయంత్రం ఓ బిఎండబ్ల్యు కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సిగ్నల్ వద్ద కారు, ద్విచక్రవాహనం ఆగి ఉన్న సమయంలో వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన బీఎండబ్ల్యూ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న మహిళ గాల్లోకి ఎగిరి పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. ప్రమాదానికి కారణమైన అభిషేక్‌ను అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో వాహనం నడిపినట్టు గుర్తించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని, కారులో ఉన్న వారిని విచారిస్తున్నారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.